క్లుప్తంగా

నేడు పౌరహక్కుల దినోత్సవం

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో శనివారం ఉదయం అగర్‌గూడ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంటరానితనం నిర్మూలన కోసం ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

బోరు ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని రాజురా గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం తాగునీటి కోసం మాజీ జెడ్పీటీసీ, బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావ్ సహకారంతో బోరు వేయిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయం ఆవరణలో బోరు కోసం భూమిపూజ చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు గోపాల్, శ్రీకాంత్, వసంత్‌రావ్, ప్రకాశ్, మోహన్, ఏమాజీ, రాజేందర్, విజయ్, కుసుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సెయింట్ క్లారిటీ స్కూల్ ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఫీజులు చెల్లించడంలేదనే కారణంతో విద్యార్థులను ఎండలో బయట నిల్చోబెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని మేనేజర్ జోషి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'భట్టి'ని కలిసిన డీసీసీ అధ్యక్షుడు


డిప్యూటీ సీఎంను కలిసిన విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు, కుమురంభీమ్ ప్రాజెక్టు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా ఏర్పాటైన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమున్న నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

తొలి యూనిక్ డిజెబులిటీ ఐడీకార్డు అందజేత


మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా యూనిక్ డిజెబులిటీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పథకం కింద దివ్యాంగుడికి మొదటి యూనిక్ డిజెబులిటీ ఐడీకార్డు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లు నిలిపివేత

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో శనగ కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో శనివారం నుంచి ఏప్రిల్1వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. 2వ తేదీన కొనుగోళ్లు తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

డ్రెయినేజీలు లేక అస్తవ్యస్తం


ఇళ్ల మధ్యలో మురికి నీరు


పోచమ్మనగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు


మోతిపటార్‌లో..

లింగాపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగ నీరంతా రోడ్లపై, ఇళ్లమధ్య వచ్చి చేరుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పారుతున్న నీటి వల్ల ద్విచక్ర వాహనదారులు జారిపడిన సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాలలో డ్రెయినేజీలు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

– లింగాపూర్

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి


జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఆసిఫాబాద్‌అర్బన్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని జామా మసీద్ ఇమామ్ మౌలానా అయుబ్ అహ్మద్ అష్రఫీ, నాయకులు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామా మసీద్ ఆవరణలో చేతులకు బ్లాక్ బ్యాండ్ ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, అహ్మద్, తాజ్, షాకీర్, సయ్యద్ రహమాన్, అర్షద్, అఖిల్, నాయిమ్‌ఖాన్, అబ్బు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

కాగజ్‌నగర్‌రూరల్: వక్ఫ్ సవరణ బిల్లు, 2024కు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముస్లింలు నిరసన చేపట్టారు.

రంజాన్ కానుకలు పంపిణీ


కానుకలు అందజేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: రంజాన్ పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రలో బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు తన నివాసంలో ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్ని వర్గాల ప్రజలు తమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కోట్నాక విజయ్, ఖాండ్రె విశాల్, జయరాజ్, సుంకరి పెంటయ్య, ముషీర్, నజీ ర్, అలీ, శ్రీశైలం, వెంకన్న, నాసర్ పాల్గొన్నా రు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన 'అరిగెల'


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న అరిగెల నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్యను శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రేగుంట ప్రవీణ్ కుమార్, ముషీర్, మాటూరి జయరాజ్ ఉన్నారు.

స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి..

జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్యకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, జిల్లాలో అద్దెతో ఉన్న గురుకుల భవనాలకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో పురుష డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్రైస్తవులకు భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న సంఘం నాయకులు

కౌటాల: క్రైస్తవులకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలని సిర్పూర్ నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యేసుకుమార్ అన్నారు. శుక్రవారం కౌటాలలోని ఎష్కోల్ చర్చిలో పాస్టర్స్ అసోషియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి సమీపంలో క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగిడాల మృతిపై అనుమానం ఉందన్నారు. ప్రభుత్వం, న్యాయస్థానాలు పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని తెలిపారు. సమావేశంలో పాస్టర్ల సంఘం నాయకులు తిమోతి, శ్రీనివాస్, ఫిలిప్, ఐషక్‌నాయక్, జయరాజు, మూర్తి, మధుకర్, సునీల్‌కుమార్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని వినతి



మంత్రి వెంకటరెడ్డికి విన్నవిస్తున్న అరుణ్ కుమార్

బోథ్: నియోజకవర్గ కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శుక్రవారం కలిసి విన్నవించారు. నిజాం కాలంలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. భవన నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి భవనం నిర్మాణం కో సం చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ సీఈని ఆదేశించారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వామన్‌రావ్ దేశ్‌పాండే, కార్యదర్శిగా పంద్రం శంకర్, ఉపాధ్యక్షుడిగా ధమ్మపాల్, జాయింట్ సెక్రటరీగా విజయ్ కుమార్, కోశాధికారిగా హరీశ్, స్పోర్ట్స్ సెక్రటరీగా వివేక్ సింగ్, మహిళ ప్రతినిధిగా గంగసాగర్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎట్టల రాములు తెలిపారు.

నిద్రలో నిఘా వ్యవస్థ



దహెగాం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసులు చెబుతుంటారు. మండల కేంద్రంలో గత రెండు సంవత్సరాల క్రితం పోలీసుల ఆధ్వర్యంలో వ్యాపారుల సహకారంతో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్క గ్రామం.. నాలుగు పేర్లు

- రెవెన్యూ రికార్డుల్లో చిత్తగూడ.. ఐటీడీఏ రికార్డుల్లో గోండ్‌గూడ(డి)
- గొర్యగూడ, దేవాపూర్ గోండ్‌గూడ అనే మరో రెండు పేర్లు
- గ్రామంలో అందరూ బంధువులే


నాలుగు పేర్లున్న గిరిజన గ్రామం ఇదే

కెరమెరి: సర్వసాధారణంగా ఊరికి పేరు ఒకటే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండు పేర్లు కూడా ఉండొచ్చు. కానీ ఇక్కడ మాత్రం దానికి భిన్నంగా ఒకే గ్రామానికి నాలుగు పేర్లు ఉన్నాయి. మండలంలోని తుమ్మగూడ గ్రామ పంచాయతీలో ఉన్న ఓ గిరిజన పల్లెలో 19 కుటుంబాలు, 87 మంది జనాభా నివసిస్తున్నారు. ఆ గిరిజన పల్లెకు నాలుగు పేర్లున్నాయి. చిత్తగూడ, గోండ్‌గూడ (డి), గొర్యగూడ, దేవాపూర్ గోండ్‌గూడగా ఆ గ్రామాన్ని నాలుగు పేర్లతో పిలుస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో చిత్తగూడగా పేరున్నప్పటికీ, ఐటీడీఏ రికార్డుల్లో గోండ్‌గూడ (డి)గా ఉంది. ఇక స్థానికులు గొర్యగూడ, దేవాపూర్ గోండ్‌గూడగా పిలుస్తున్నారు. 70 సంవత్సరాల చరిత్రగల ఈ ఆదివాసీ గ్రామానికి ఆది నుంచి ఎన్నోరకాల పేర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం నాలుగు పేర్లతో పిలుస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అధికారులు తికమక..

నూతన అధికారులు ఇక్కడికి రావాలంటే తికమక పడుతున్నారు. ఒక్కొక్కరిని అడిగితే ఒక్కో పేరు చెబుతుండడమే ఇందుకు కారణం. ఐతే గ్రామంలో ఒకే తెగ (గోండ్)కి చెందిన వారుండడం.. అందరూ ఒకరికొకరు దగ్గరి బంధువులు కావడం.. నేటికీ ఏ గొడవలు లేకుండా కలిసికట్టుగా, ఐకమత్యంగా ఉండడం వీరి ప్రత్యేకత.

చిత్తగూడగానే పిలుస్తాం..



70 ఏళ్ల చరిత్రగల మా గ్రామాన్ని చిత్తగూడగానే పిలుస్తాం. చాలా మంది అసలు మీ ఊరు పేరేంటి అని అడుగుతుంటే విచిత్రంగా ఉంటుంది. 25 సంవత్సరాల నుంచి వివిధ రకాల పేర్లతో పిలుస్తున్నారు.

– కుమురం జంగు, గ్రామ పటేల్

విశేషంగా భావిస్తున్నాం..



గ్రామంలో 19 కుటుంబాలు ఉన్నప్పటికీ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటాం. అదే మా ప్రత్యేకత. నేటి వరకు మా గ్రామంలో ఎప్పుడు గొడవలు కాలేదు. ఊరికి నాలుగు పేర్లు ఉండడం విశేషంగా భావిస్తున్నాం.

– కుర్సెంగ లక్ష్మిబాయి

అందరూ బంధువులే



గ్రామానికి అనేక పేర్లు ఉన్నా ప్రస్తుతం నాలుగు పేర్లు వాడుకలో ఉన్నాయి. మా గ్రామంలో నివసించే వారందరూ ఒకరికిఒకరు బంధువులే. ఏదో ఓ కోణంలో చుట్టాలవుతాం. అందుకు అందరం ఒకే కుటుంబంలా కలిసి ఉంటాం.

– కుంరం భీంరావు

బస్టాండ్‌లో మరమ్మతులు చేపట్టాలని వినతి

బోథ్: సొనాల గ్రామంలోని ప్రయాణ ప్రాంగణంలో మరమ్మతులు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు ఎంపీవో అతుల్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణలకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సోమన్న, అమృత్‌రావు, భోజన్న, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

బోథ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను తప్పుపడుతూ ఏఐసీసీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పేర్కొన్నారు. ఇచ్చోడలో సన్నాహక కార్యక్రమాన్ని శనివారం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'జైబాపు జైభీమ్ జైసంవిధాన్'

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ తెలిపారు. శుక్రవారం ఇచ్చోడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ కార్యదర్శి జనక్ ప్రసాద్ రానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, దూట రాజేశ్వర్, ఖయ్యూం, లాజర్, మర్సుకోల తిరుపతి, జగదీవ్, కళావతి, దేవానందం, రాజమణి, ప్రభాకార్, భాస్కర్, సలీం ఉన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కౌటాల: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లింల కోసం కౌటాలలోని జామీయా మసీదులో శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం శాంతి, సౌభ్రాతృత్వం అన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, నాయకులు నాహీం, అజ్మత్ అలీ, విఠల్, పోశం పాల్గొన్నారు.

హీరాసుక జెండా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న పర్ధాన్ సమాజ్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కులగురువు, గొండి ధర్మగురు హీరాసుక జెండా తొలగించి, దహనం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పర్ధాన్ సమాజ్ పెద్దలు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హీరాసుక జెండా తొలగించడంతో శుక్రవారం ఉదయం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని తొలగించిన హీరాసుక జెండాను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై దుబ్బక సునీల్ కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పర్ధాన్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గ నగేశ్, జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్, మెస్రం శంకర్, పర్ధాన్ సంఘం నాయకులు, కేస్లాపూర్ గ్రామస్తులు ఆర్క ఖమ్ము, పెందోర్ అంకుష్, మెస్రం శేషనారాయణ్, తోడసం శాంత్‌రాజ్, మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మెస్రం ఆనంద్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, గేడం భరత్, సోయం మురహరి తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఆసిఫాబాద్: జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేనషన్ కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా స్వాగత్, ప్రధాన కార్యదర్శిగా గుండు శ్రావణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా కిరణ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఫ్లెక్సీ, ప్రింటింగ్‌పై ఆర్థిక భారం పెరిగినందున యూనియన్ విడుదల చేసిన చాట్ ప్రకారమే ప్రింట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై రాష్ట్ర స్థాయి యూనియన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.